# కాంగ్రెస్‌లో కలకలం

- పెద్దపల్లి జిల్లాలో పార్టీకి భారీ షాక్
- మూకుమ్మడిగా సీనియర్ల రాజీనామా
- అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటనకు ముందురోజే భారీ కుదుపు
- నేడో రేపో వీడనున్న మరికొంత మంది నాయకులు, కార్యకర్తలు
- భగ్గుమంటున్న అంతర్గత విభేదాలు
- బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపణలు

పెద్దపల్లి, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ) : పెద్దపల్లి జిల్లాలోని మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గురువారం పర్యటించనున్న సమయంలో బుధవారం పెద్దపల్లి నియోజకవర్గం నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకులు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం కాంగ్రెస్‌ను కుదుపేసింది. కాంగ్రెస్ నాయకులు సీ సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ స్టాటజికల్ కమిటీ సభ్యుడు, ఓదెల జడ్పీటీసీ గంటా రాములు, మాజీ ఎంపీపీ వేముల రా మ్మూర్తి ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరారమణారావుపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం కలకలం రేపింది. పార్టీలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, అవమానించి, ఆత్మాభిమానా న్ని చంపి పార్టీ నుంచి బయటికి పంపే కుట్రలు చేస్తున్నారని విమర్శించడం కాంగ్రెస్ అగ్రనేతలకు షాకిచ్చినట్లయ్యింది. తమతోపాటు మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు సైతం పార్టీని వీడేందుకు సిద్ధమవడంతో వారందరితో కలిసి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించడం అందరిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. మంథని, పెద్దపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటిస్తున్న నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకులంతా ఏకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ మూకుమ్మడి రాజీనామాలు చేయడం కాంగ్రెస్‌లో కలకలం రేపింది.

### రాహుల్ పర్యటనపైనా అంతర్యుద్ధమే..

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ టూర్ షెడ్యూల్‌లో తొలుత పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం, పెద్దపల్లి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. ఆ తర్వాత రామగుండం నియోజకవర్గాన్ని మినహాయించి మంథని నియోజకవర్గానికి మార్చి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ పోటీ చేస్తున్న రామగుండం లేకుండా చేయడంతో అంతర్గత విభేదాలు భగ్గుమన్నాయి. అగ్రనేత పర్యటన నేపథ్యంలో సమన్వయ లేమి స్పష్టంగా కనిపిస్తున్నది. రాహుల్ పర్యటనకు కొద్దిగంటలే మిగిలి ఉండగా ఇంకా రూట్ మ్యాప్ సిద్ధంగా లేకపోవడం, ఎవరికి వారే యమునా తీరే అనే విధంగా ఉంది.

### ముఖ్యకార్యకర్తలకు మొండి'చేయి'

ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పర్యటన జాతీయ భద్రతా దళాల రక్షణ మధ్య కొనసాగనుండగా ముఖ్య కార్యకర్తలను కలిచే అవకాశాలు లేకుండా పోయాయి. దీంతో తమకు మొండిచేయేనా అని కార్యకర్తలు మదన పడుతున్నారు. పరిమిత సంఖ్యలో పాసులను జారీ చేస్తుండగా, అవి కూడా పోలీసుల వద్దే ఉంచారు. టీపీసీసీ అధ్యక్షుడితోపాటు పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు మాజీ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తుండడంతో జిల్లాలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాహుల్ పర్యటనకు దూరంగా ఉండేందుకు నిర్ణయించుకున్నారు. పర్యటన పూర్తికాగానే మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి దూరం కానున్నట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం

- పార్టీని జేబు సంస్థగా మార్చుకున్న రేవంత్‌రెడ్డి
- రాహుల్ గాంధీ మాటలు రేవంత్ రాసిచ్చిన స్క్రిప్టే..
- ఆయన మాటలను నియోజకవర్గ ప్రజలు నమ్మరు
- రేవంత్‌రెడ్డిపై కాంగ్రెస్ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీల తీవ్ర విమర్శలు

కాంగ్రెస్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, అవమానించి.. ఆత్మాభిమానాన్ని చంపి పార్టీ నుంచి బయటికి పంపే కుట్రలు చేస్తూ.. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి పార్టీని తన జేబు సంస్థగా మార్చుకున్నాడని టీపీసీసీ స్ట్రాటజిక్ కమిటీ సభ్యులు, ఓదెల జడ్పీటీసీ గంటా రాములుయాదవ్, మాజీ ఎంపీపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీ సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, సీనియర్ నాయకుడు హాజీ ధ్వజమెత్తారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్‌కే గార్డెన్స్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేస్తూ వారితోపాటు మరో ఇరవై మంది ఆ ఆపార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ అధినేత రాహుల్ గాంధీకి తాము తమ బాధలు చెప్పే అవకాశం కూడా పార్టీలో లేదన్నారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని కనీసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ సర్వేలన్నీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి తనకు అనుకూలంగా మార్చుకొని, ఆయనకు సపోర్టుగా సర్వే రిపోర్టులను సమర్పిస్తున్నారని విమర్శించారు. ఒక పర్సనల్ ఎజెండాతో వచ్చి రేవంత్‌రెడ్డి పార్టీని సర్వనాశనం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. సీనియర్లను, సిట్టింగ్ ఎమ్మెల్యేలను కలుపుకొని పోకుండా తన వ్యక్తిగత ఎజెండాను అమలు చేస్తున్నాడని విమర్శించారు. ఎవరైతే టికెట్ రేసులో ఉంటారో అలాంటి వారందర్నీ తొక్కిపడేయడం, తన వారికి అనుకూలంగా రిపోర్టులు తెప్పించుకొని డబ్బులు ఉన్న వారికే టికెట్లు ఇస్తున్నాడని దుయ్యబట్టారు. ఆత్మాభిమానం లేని చోట, అవమానం జరిగిన చోట ఉండేది లేదని వారు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మద్దతుతో పెద్దపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు విర్రవీగుతున్నాడని విమర్శించారు. పెద్దపదల్లి జిల్లాలో రాహుల్ గాంధీ పర్యటించినా ఒరిగేదేమీ లేదని, రాహుల్ మాట్లాడేదంతా రేవంత్ రెడ్డి రాసిచ్చిన స్క్రిప్టేనని స్పష్టం చేశారు. పార్టీలో బీసీలపై తీవ్రమైన దౌర్జన్యం జరుగుతున్నదన్నారు. నాలుగుసార్లు ప్రజల ఆమోదంతో ఎదుగుతున్న తమపై కుట్రలు, కుతంత్రాలకు దిగుతున్నారని విమర్శించారు. తాము, కాంగ్రెస్ పార్టీలో ఉన్న మరికొంత మందిని కలుపుకొని త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

# కరీంనగర్ నుంచే అగ్గి పుట్టాలి

- ఆ అగ్నికీలల్లో కాంగ్రెస్, బీజేపీ దహించుకుపోవాలి
- కరీంనగర్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి కేటీఆర్

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : 'కరీంనగర్‌కు మరోసారి కాబోయే ఎమ్మెల్యే గం గుల కమలాకరే.. ఆయనపై పోటీ చేసేందుకు ఇతర పార్టీల నాయకులు భయపడుతున్నరు. అటొకలు.. ఇటొకలు పారిపోతున్నరు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. బుధవారం కరీంనగర్ జి ల్లా కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వా ద సభలో ఆయన మాట్లాడారు. 2009 నవంబర్ 29న అల్గునూర్ చౌరస్తాలో కేసీఆర్ అరెస్ట్ అయినపుడు అంటుకున్న అగ్గి తెలంగాణ వచ్చే వరకు ఆరలేదని, ఇప్పుడు నవంబర్ 30న మళ్లీ కరీంనగర్‌లో అగ్గి పుట్టాలని, ఆ అగ్నికీలల్లో కాంగ్రె స్, బీజేపీ దహించుకపోవాలని, కొట్టుకుపోవాలని పిలుపునిచ్చారు. ఆయన మాటల్లోనే..

### నాలుగు మెడికల్ కాలేజీలు తెచ్చాం

ఒక్క మెడికల్ కళాశాల లేని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఇప్పుడు నాలుగు మెడికల్ కళాశాలలు వచ్చినయి. మంత్రి గంగుల కమలాకర్ నాయకత్వంలో బలహీన వర్గాల బిడ్డలకు గానీ, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీల పిల్లలకు 1,001 గురుకుల పాఠశాలలు ఉన్న ఒకే ఒక రా ష్ట్రం తెలంగాణ. ఈ ఘ నత గంగుల కమలాకర్‌కు కూ డా దక్కుతది. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో బలహీన వర్గాల సంక్షేమ శాఖను ఆయన అత్యద్భుతంగా నిర్వహిస్తున్నారు.

### వాళ్లకు అధికారం ఇస్తే యాభై ఏండ్లు వెనకకుపోతం

కమలాకర్ అన్న ఒక గొప్ప మాట చెప్పిండు. 1956లో మన తాతలు ముత్తాతలు తప్పు చేశారు. ఆనాడు తెలంగాణ, ఆంధ్రా కలిసేందుకు ఒప్పుకుని తప్పు చేశారు. ఆ తప్పు నుంచి బయట పడేందుకు 58 ఏండ్లు పట్టింది. ఎన్నో రకాలుగా తండ్లాడితే ఆ తప్పుల నుంచి మొన్న మొన్ననే బయటపడ్డం. ఇప్పుడు మరోసారి తప్పు చేసి కాంగ్రెస్‌కో, బీజేపీకో ఓటు వేస్తే మరోసారి యాభై ఏండ్లు వెనుకకు పోతం. కష్టపడి సాధించుకున్న తెలంగాణ ఆగమైతది. ఇప్పుడు మరో తప్పు చేసి ఆ పరిస్థితులను పునరావృతం చేసుకోవద్దు. మన బీఆర్ఎస్ అభ్యర్థులకే వేసే ఓటు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి దోహదపడుతుంది. అదే కాంగ్రెస్‌కో, బీజేపీకో వేస్తే ఢిల్లీకి, గుజరాత్‌కు పోతుంది. వాళ్లకు గులాంగిరి చేసెతానికి మళ్లా తెలంగాణ యాభై ఏండ్లు వెనకకు పోవడానికి కారణం అవుతుంది.

### రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం

గంగుల కమలాకర్ స్వయంగా ఒక ఆలోచన చేసి సీఎం కేసీఆర్‌కు చెప్పిండు. తెలంగాణ అన్నపూర్ణగా మారింది. దేశానికే అన్నం పెట్టే స్థాయికి ఎదిగింది. కానీ, ఇక్కడ ఉండే మన బిడ్డలకు కడుపు నిండా సన్న బియ్యంతో బువ్వ పెడదామని చెప్పగానే అన్నపూర్ణ అనే కొత్త పథకం తీసుకురావాలకున్నం. అన్ని రేషన్ కార్డుల మీద దొడ్డు బియ్యం బదులు నాణ్యమైన సన్న బియ్యం అందిస్తం. కొత్తగా సౌభాగ్యలక్ష్మి అనే పథకం తెస్తున్నం. అర్హులైన ప్రతి మహిళకు నెలకు ₹3 వేలు అందించబోతున్నం. ఆసరా పెన్షన్లు పెరుగుతాయి. రైతు బంధు పెరుగుతది. కేసీఆర్ ఆరో గ్య రక్ష అనే కొత్త కార్యక్రమం కింద ఎవరికి ఏ అవసరమైనా ₹15లక్షల విలువైన వైద్య సేవలు కుటుం బం మొత్తానికి ఉచితంగా అందించబోతు న్నం. ఇన్ని పథకాలు అమలు కావాలంటే కమలాకర్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్‌ను గెలిపించి శాసన సభకు పంపించి కేసీఆర్‌ను ఆశీర్వదించాలి.

### వాళ్ల వీళ్ల మాటలు నమ్మద్దు

రేపు కరీంనగర్‌కు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వస్తున్నారు. ఇంకా ఎవరెవరో వస్తుంటారు.. పోతుంటారు. ఏవేవో మాటలు చెప్తుంటారు. వాళ్ల మాటలు విని యువకులు మోసపోవద్దు. ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి తొమ్మిదేండ్లలో 2.20 లక్షల ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టి 1.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. మిగతావి కూడా భర్తీ చేస్తాం. జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటిస్తాం. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పూర్తి స్థాయిలో పటిష్టంగా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగాలు భర్తీ చేస్తాం. తిరిగి మరోసారి అవకాశం కల్పించాలని పేరు పేరునా విజ్ఞప్తి చేస్తున్నా.

# మీలో ఒకడిగా.. మీతోనే ఉన్నా

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : తాను పదిహేనేండ్లుగా ఎమ్మెల్యేగా రాజకీయాల్లో ఉన్నానని, సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో కరీంనగర్ ను ఎంతో అభివృద్ధి చేశానని కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశా రు. మీ బిడ్డగా మీతోనే ఉన్నానని, మరోసారి మంచి మెజార్టీతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్, కేటీఆర్ మన వెంట ఉన్నారని, రాబోయే రోజుల్లో కరీంనగర్ హైదరాబాద్ తర్వాత ఒక గొ ప్ప నగరంగా కరీంనగర్‌ను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఇప్పటికే నగరంలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించామని, ఇంకా అనేక పనులు కొ నసాగుతున్నాయని, ఈ పనులు పూర్తి చేయాలంటే మరోకరితో సాధ్యం కాదని అన్నారు. కాంగ్రెస్, బీ జేపీ నాయకులు ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు తప్పా మళ్లీ మీ మధ్యన ఎప్పుడు కనిపించారని ప్రశ్నించారు. జనం మధ్యకు ఎవరు వస్తున్నారు? ఏం చేస్తున్నారు? అని గమనించాలని సూచించారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం రాకముందు కూడా ప్రభుత్వాలు ఉన్నాయని, కరీంనగర్ అభివృద్ధి సమైక్య పాలకులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారని మంత్రి గంగుల ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇప్పటి వరకు మచ్చ లేకుండా బతికానని చెప్పారు. ఈ పదిహేనేండ్లలో నగరాన్ని శాంతియుత వాతావరణంలో ఉంచామని అన్నారు.

# గంగుల గెలుపు ఖాయం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కరీంనగర్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ అభివృద్ధి ఒక్కటే గంగుల కమలాకర్‌ను గెలిపిస్తుందని, ఆయన గెలుపు ఖాయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. చెప్పిన పనులు చేశామని, చెప్పనివి కూడా చేశామని అన్నారు. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న పార్టీలు, ప్రభుత్వాలు రాష్ట్రానికి ఏం చేశాయో..? తొమ్మిన్నరేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏం చేసిందో..? ప్రజల్లో చర్చ జరగాలని సూచించారు. ప్రజల కోసం పాటు పడే పార్టీలు, నాయకులను మాత్రమే ప్రజలు గుర్తుంచుకుంటారని, ఈసారి కూడా బీఆర్ఎస్‌నే ప్రజలు గెలిపించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి కేసీఆర్‌కు ఘన విజయాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కరీంనగర్‌ను లండన్, డల్లాస్‌గా తీర్చిదిద్దుతానని చెప్పారని, అదే బాటలో ఇప్పుడు ముందుకెళ్తున్నామని అన్నారు. నగరంలో ఎంత పెద్ద వర్షం పడినా, కాలుకు బురద అంటకుండా ఇంటికి వెళ్లే పరిస్థితి ఉందన్నారు. అందుకు మన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల చేసిన కృషే ఇందుకు కారణమని చెప్పారు. ఒకప్పుడు ఎంపీగా తాను, మంత్రిగా కేటీఆర్ కేంద్రంపై పోరాడి కొన్ని నిధులు తెచ్చామని, అయితే వాటిని సద్వినియోగం చేసి, అభివృద్ధి చేసిన నాయకుడు మాత్రం గంగుల కమలాకర్ అని అన్నారు. మనం కేంద్రంతో ఎంత కొట్లాడినా ఆశించిన నిధులు మాత్రం ఇవ్వలేదని మండిపడ్డారు. కరీంనగర్ అభివృద్ధి మన సొంత ఆలోచనతో, నిధులతో జరుగుతున్నదని అన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ అని ఆలోచన చేస్తే ఇది ఆచరణ సాధ్యమా అని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారని, కానీ, దానిని ఆచరణలో పెట్టి చూపుతున్నామని అన్నారు. తెలంగాణ రాకముందు ఒక్క మెడికల్ కళాశాల కూడా సాధించలేని కాంగ్రెస్ నాయకులకు చెంప పెట్టులా ఇపుడు ఉమ్మడి జిల్లాలో నాలుగు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామని అన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
కావలెను
jobs Apply Now!
★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-All

CHANGE OF NAME
I, DAMARAPALLI MOGILI S/o. DAMARAPALLI RAJAMALLU R/o.Plot No. 344, Indiramma P.K.Ramaiah Colony, NTPC, Ramagundam mandal, Peddapalli Dist. TS, have changed My Name as DANEPALLI MOGILI S/o. DANEPALLI RAJAMALLU for all Purpose.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194